క్లుప్తంగా

టెక్నికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కాచిగూడ: టెక్ మహీంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో లెటెస్ట్ టెక్నికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ కాచిగూడ సెంటర్ మేనేజర్ కిరణ్‌తేజ ప్రకటించారు. మంగళవారం కాచిగూడలోని టెక్ మహీంద్ర స్మార్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెషనల్ కోర్సులైన ఇంటర్నెట్ టెక్నాలజీ ఫైబర్, 5జీ, ఏసీ, ఫ్రిజ్ వాషింగ్ మెషిన్, కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, టైపింగ్ ప్రాక్టిస్ కోర్సుల్లో ఉచితశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఒకేషనల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు అర్హులు. వివరాలకు 8464071893/9985333605.

కిక్ బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ



మెడల్స్‌తో నారాయణగూడ వైఎంసీఏ క్రీడాకారులు

కాచిగూడ: ఎల్.బీ.స్టేడియం బాక్సింగ్‌హాల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర 4వ ఓపెన్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో నారాయణగూడ వైఎంసీఏ క్రీడాకారులు పాల్గొని పలు మెడల్స్‌ను గెలుచుకున్నారు. విజేతలను మంగళవారం వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ప్రిస్‌లీ గైస్ అభినందించారు. కోచ్‌లు లక్ష్మణ్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

కాచిగూడ: విద్యార్థులు కష్టపడి చదివితే ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ అన్నారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ వేలూరు లింగయ్య గుప్తా జయంతి సందర్భంగా మంగళవారం కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వేలూరు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదువు స్థిరాస్తిలాంటిదని, విద్యకు ఉన్న విలువ మరే రంగంలోనూ లేదన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకుసాగాలని సూచించారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు కోశాధికారి కూర రఘువీర్, వైశ్య హాస్టల్ ఇన్‌చార్జి అధ్యక్షుడు మధు, ఉప్పల రాజేశ్వర్, మ్యాడం దయాకర్‌గుప్తా తదితరులున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



రాధాకృష్ణుల వేషధారణలో విద్యార్థులు

నల్లకుంట: న్యూనల్లకుంటలోని శ్రీరామ కో-ఆపరేటివ్ ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం చిన్నారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు అలరించాయి. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో విద్యార్థుల ఆకట్టుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు జీవీ సుబ్బలక్ష్మి, గీత, సుజాత, మమత, భార్గవి, రోజారాణి, శైలజ, శ్రవంతి, నాగలక్ష్మి తదితరులున్నారు.

'శ్రీ కృష్ణ తులాబారం' నాటక ప్రదర్శన

చిక్కడపల్లి: ప్రఖ్యాత నటులు డాక్టర్ నందమూరి తారకరామారావు ప్రముఖ నటి జమున నటించి ప్రజల హృదయాల్లో నిలిచిన శ్రీ కృష్ణతులాబారం సినిమాను త్యాగరాయగానసభలో నాటక రూపంలో వీణాపాణి కళానిలయం వీనస్‌జెమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ప్రదర్శించారు. ప్రొఫెసర్ శ్రీదేవి కృష్ణుడిగా ఎన్టీఆర్‌ను అనుకరిస్తూ.. నటించగా సత్యభామగా ఉష రుక్మిణిగా గాత్రి ఇంద్రుడిగా ఫణింద్రనాథ్, శచీదేవిగా వరలక్ష్మి ఇతర పాత్రల్లో అంజలి పద్యాలయ కళాకారులు నటించారు. ముఖ్యఅతిథిగా ఎం.వరలక్ష్మి, గాయని కనకరత్నం, సంఘసేవకురాలు సీతాలక్ష్మి, నటుడు అక్కిరాజు సుందరరామకృష్ణ వారిని అభినందించారు.

అనారోగ్యంతో అర్చకుడి మృతి

చిక్కడపల్లి: ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి వివేక్ నగర్ ఆంజనేయస్వామి దేవాలయ అర్చకుడు పురుషోత్తమాచార్యులు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. దేవాలయం కార్యనిర్వాణాధికారి మాచర్ల దేవనాథం, అర్చకులు బుగ్గాలక్ష్మిపతిశర్మ, వెంకటాద్రి, ఆచారి ఇతర సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. దేవాలయం చైర్మన్ మురళీప్రసాద్, ఈవో దేవనాథం, అర్చకులు పురుషోత్తమాచార్యుల కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.



తిలక్‌నగర్‌లో కూలిన వృక్షాన్ని తొలగింపజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

భారీ వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం



అడిక్‌మెట్ డివిజన్ నాగమయ్యకుంటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ పరిధిలో భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. మంగళవారం కురిసిన వర్షం దాటికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా.. డ్రైనేజీ, నాలాలు పొంగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెట్లు నేలకూలడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రజాప్రతినిధులు పర్యటించి బాధితులకు భరోసా ఇచ్చారు. కొన్నిచోట్ల పురాతన గోడలు కూలడంతో భారీ ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

– అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ బృందం



బాపిస్ట్ చర్చి వద్ద వరద ఉధృతి..



బాగ్‌అంబర్‌పేటలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



ప్రేమ్‌నగర్‌లో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్



నాగమయ్యకుంట బాధితులతో సంగిశెట్టి జగదీశ్వర్‌రావు



గోడ కూలడంతో ధ్వంసమైన ద్విచక్రవాహనం

వీరశైవ లింగాయత్, బలిజలను ఓబీసీలో చేర్చాలి



నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ అహీర్ గంగారాంకు వినతిపత్రం అందజేత

కాచిగూడ: వీరశైవ లింగాయత్, లింగ బలిజలను జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చాలని వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్ప ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మంగళవారం ఢిల్లీలో నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ అహీర్ గంగారాంను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్న 90శాతం వీరశైవ లింగాయత్‌లు, లింగ బలిజలకు గత 14 ఏళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో విద్యావకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని వివరించామన్నారు. ఈ విషయంలో నేషనల్ బీసీ కమిషన్ సభ్యులు స్పందించి త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, కోశాధికారి దినేష్ పాటిల్ తదితరులున్నారు.

వేర్వేరు ఘటనల్లో 8 మందికి జైలు

ముషీరాబాద్: గంజాయి, మత్తు పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో నానా హంగామా చేస్తూ.. పోలీసులు వారి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఐదుగురు వ్యక్తులను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారికి 10 రోజుల జైలు శిక్ష విధించారు. ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. 4వ తేదీ సాయంత్రం కొంతమంది వ్యక్తులు గంజాయి మత్తు పదార్థాలను సేవించి కాలనీలో న్యూసెన్స్ చేస్తున్నారని సమాచారం మేరకు ముషీరాబాద్ పోలీసులు రంగానగర్, భోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఈ–పెట్టీ కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. వారికి 10 రోజుల జైలు శిక్ష విధించారు.

కత్తితో తిరుగుతున్న వ్యక్తి రిమాండ్..

ముఖానికి ముసుగు వేసుకుని కత్తితో బహిరంగ ప్రదేశాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి ఎండీ అతీక్‌ను ముషీరాబాద్ పోలీసులు భోలక్‌పూర్‌లోని బడీ మసీదు వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా.. అతడికి 10 రోజుల జైలు శిక్ష విధించారు.

రోడ్డుపై వెళ్తున్న వ్యక్తితో గొడవపడ్డ ఇద్దరు..

రోడ్డుపై వెళ్తున్న సాయికాంత్ అనే వ్యక్తితో అకారణంగా గొడవపడిన షేక్ మహమూద్, షేక్ మున్వర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి




మాట్లాడుతున్న ఏసీపీ కస్తూరి శ్రీనివాస్

కాచిగూడ: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఆయా మండపాల నిర్వహకులు ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్ సూచించారు. వినాయక మండప నిర్వాహకులు, పీస్ కమిటీ, మైత్రీ సంఘాల ప్రతినిధులతో మంగళవారం కాచిగూడలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలను గణేష్ మండపాల నిర్వహకులు తప్పక పాటించాలన్నారు. గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. సెక్టార్ ఎస్సైలు ఎ.మేఘన, సుభాష్, హెచ్.నరేష్, మండప నిర్వాహకులు, పీస్ కమిటీ ప్రతినిధులు కన్నె రమేష్‌యాదవ్, ఎన్.శరత్ శ్యామ్, ఈశ్వర్ తదితరులున్నారు.

మంత్రుల హామీని అమలు చేయాలని ధర్నా

చిక్కడపల్లి: మంత్రులు హరీష్‌రావు, మల్లారెడ్డిలు ఇచ్చిన మోటార్ సైకిల్ హామీ అమలుచేయాలని, పెండింగ్ క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని తెలంగాణ కార్మిక కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణరంగ కార్మికులు కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రావు, గౌరవ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజులు మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రకటించిన ఉచిత మోటార్ సైకిళ్లు వెంటనే ఇవ్వాలని, అర్హులైన వారికి డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. మంత్రులు ఇచ్చిన హామీని అమలు చేయకపోతే కార్మికశాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు ఎల్ల సోమయ్య, లక్ష్మీనారాయణ, జంగయ్య, లక్ష్మయ్య తదితరులున్నారు. అనంతరం బోర్డు సంయుక్త కార్యదర్శి అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు.

'మేరా మాటీ.. మేరాదేశ్' లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ఎందరో అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'మేరా బూత్, సబ్‌సే మజ్‌బూత్'లో భాగంగా ప్రతి ఇంటికెళ్లి ఓటరు వెరిఫికేషన్ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కొన్ని ఓట్లను తొలగించిందన్నారు. పొరపాట్లు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబర్ 31న సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా దేశం నలుమూలల నుంచి సేకరించిన మట్టి కలశాలను ప్రధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో స్వీకరిస్తారన్నారు. పార్టీ నేతలు సందీప్ సాయి, కృష్ణగౌడ్, వనం రమేష్, కన్నె రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, కేశబోయిన శ్రీధర్, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలకు లేబర్ కార్డులు ఇప్పించాలని వినతి



మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో వడ్డెరలకు లేబర్ కార్డులు ఇప్పించాలని కోరుతూ.. మంత్రి మల్లారెడ్డికి వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణరాజు, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య, డైరెక్టర్లు డాక్టర్ ఉర్సు కృష్ణయ్య, మక్కల వెంకటేష్, పల్లపు గణేష్‌లు మాట్లాడారు. వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ తరపున రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 15 మంది చొప్పున ట్రస్ట్‌కు అనుబంధ కమిటీలను వేశామన్నారు. ఈ కమిటీలో ఉన్న రూ.1.19 లక్షల మందికి లేబర్ కార్డు ఇప్పించాలని మంత్రిని కోరామన్నారు. దశలవారీగా అందరికీ లేబర్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల స్వీపర్లకు కనీస వేతనం చెల్లించాలి



ధర్నాలో మాట్లాడుతున్న సత్యనారాయణగుప్తా

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం రూ.27 వేలు చెల్లించాలని తెలంగాణ స్కూల్ స్వీపర్స్ సంఘం గౌరవ అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ స్కూల్ స్వీపర్స్ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద సమాన పనికి సమాన వేతనం , స్వీపర్లను రెగ్యులరైజ్ చేసి, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. మహాధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ప్రభుత్వ ఉత్తర్వులతో సంబంధం లేకుండా నెలకు రూ.1623 వేతనం పొందుతూ.. అత్యంత దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 180 ప్రకారం కొందరు స్వీపర్లకు నెలకు రూ.4 వేలు చెల్లిస్తున్నప్పటికీ సెప్టెంబర్ 17, 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లందరినీ ఫుల్‌టైం స్వీపర్లుగా గుర్తించి, 61 ఏళ్లు నిండిన వారికి జీవో నెంబర్ 45 ప్రకారం రూ.15 లక్షల రిటర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగౌడ్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, సలహాదారులు ఖలీల్, ఉపాధ్యక్షుడు ఎస్. బాలరాజు, సత్యనారాయణ, లింగయ్య, సహకార్యదర్శులు ఆంజనేయులు, చంద్రయ్య తదితరులున్నారు.

గణేష్ వేడుకలకు అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ భగవంతరావు

అంబర్‌పేట: గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకునేలా ప్రభుత్వం సహకరించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంతరావు తెలిపారు. మంగళవారం గోల్నాకలో అంబర్‌పేట నియోజకవర్గం గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండప నిర్వాహకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గణేష్ మండపాల వద్ద ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. సాయంత్రం సమయాల్లో గణేష్ మండపాల వద్ద సామూహిక కార్యక్రమాలు భక్తుల భాగస్వామ్యం పెంచేలా ఉత్సవ సమితి కన్వీనర్‌లు చొరవ తీసుకోవాలన్నారు. ఉత్సవ సమితి సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆలె భాస్కర్‌రాజు, సెంట్రల్ కమిటీ సభ్యులు నాయిని బుచ్చిరెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, అంబర్‌పేట ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ అశోక్, కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, కన్నె ఉమారమేష్‌యాదవ్, విద్యుత్, జీహెచ్ఎంసీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమాజానికి మార్గనిర్దేశం ఉపాధ్యాయులే!



సన్మానిస్తున్న అంబేద్కర్ విద్యా సంస్థల కార్యదర్శి గడ్డం వినోద్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజానికి మార్గనిర్దేశం చేస్తూ.. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపే వారే ఉపాధ్యాయులని అంబేద్కర్ కళాశాలల కార్యదర్శి గడ్డం వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఎల్ఐసీ వారి సౌజన్యంతో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. అధ్యాపకులు ఎంతో అంకిత భావంతో విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించడంతో పాటు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎల్ఐసీ అసిస్టెంట్ సెక్రటరీ నరేంద్రరామచంద్రన్, కళాశాల డైరెక్టర్ రిషికాంత్, కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు తదితరులున్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్‌కు అవార్డు



అవార్డును అందుకుంటున్న లెక్చరర్ రాధిక

కాచిగూడ: కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ వి.రాధిక రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ టీచర్ అవార్డును అందుకున్నారు. మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవ వేడుకల్లో ఈ అవార్డును మంత్రి సబితాఇంద్రారెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందని, దీంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ స్వర్ణలత, లెక్చరర్లు, సిబ్బంది ఆమెను అభినందించారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంగిశెట్టి జగదీశ్వర్‌రావు

చిక్కడపల్లి: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్‌లోని గీతాంజలి పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర ప్రశంసనీయమన్నారు. ముఠా జైసింహ,"స్కూల్ ప్రిన్సిపల్ శాంత, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, గుండు జగదీశ్‌బాబు, రవిశంకర్ గుప్తా, ఎస్టీపేమ్, శ్రీకాంత్, ప్రశాంత్, సత్యనారాయణ తదితరులున్నారు.

భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులే..

భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కార్పొరేటర్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులు సీహెచ్. వాణీశ్వరశాస్త్రి, శ్రీనివాస్, నవీన్‌కుమార్‌లను ఆమె శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి ఉత్తమ పౌరులను అందించే పాత్రను పోషిస్తున్న ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్, దొనేటి సత్యం, ఆనంద్‌రావు, సుధాకర్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు సన్మానం..

ముషీరాబాద్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులను టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు గురువులను గౌరవించాలని, గురువులు విద్యతో పాటు సంస్కారం, జ్ఞానం, జీవన విధానం నేర్పించడంలో వారికి ఎవరూ సాటిరారని కొనియాడారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీ.ఎస్.కేశవ్, జీ.ఎస్.చారి, రమేష్, వేణుగౌడ్, ఇబ్రహీం తదితరులున్నారు.